రాష్ట్రాభివృద్ధి సీఎం వై.ఎస్.జగన్‌తోనే సాధ్యం

'వై నీడ్స్ ఏపీ జగన్' కార్యక్రమంలో నగర మేయర్ కావటి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్‌నాయుడు

పట్నంబజారు: రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ సారథిగా ముందుకు తీసుకెళుతున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం ఏడో డివిజన్‌లో గురువారం నగర డెప్యూటీ మేయర్ షేక్ షజీల ఆధ్వర్యంలో 'వై నీడ్స్ ఏపీ జగన్' కార్యక్రమం గుంటూరువారితోటలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్ పేదల పక్షపాతి అని, పలు విప్లవాత్మక నిర్ణయాలతో ఆయన ముందుకు సాగుతున్నారని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ కనీవిని ఎరుగని విధంగా పలు సంస్కరణలతో సుపరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికీ సంక్షేమం అందించిన సీఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని, రానున్న ఎన్నికల్లో మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో పేదల కష్టాలు చూసి ఆయన ప్రకటించిన నవరత్నాలు నవ శకానికి నాంది పలికాయని చెప్పారు. పేదల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చేందుకు ఎన్నో పథకాలు అమలు చేసిన సీఎం జగన్‌కే దక్కుతోందని తెలిపారు. డెప్యూటీ మేయర్ షేక్ షజీల మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, పార్టీలకతీతంగా కేవలం అర్హతే ప్రమాణికంగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి బటన్ నొక్కి నగదు జమ చేస్తున్న ఘనత సీఎం జగన్‌దేనని పేర్కొన్నారు. మెరుగైన పాలనతో మేలైన సమాజ నిర్మాణం కోసం పాటుపడుతున్నారని వివరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్ పాలనలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధిస్తోందని, సామాజిక న్యాయంలో ఆయన దేశంలోనే ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలతోపాటు, ఇవ్వని వాటిని కూడా ఎన్నో అమలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు షేక్ గులాం రసూల్, ఫారూఖ్, హన్ను, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.బాలసుందరరావు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ బి.కోటేశ్వరరావు చెప్పారు. నగరంలో గతనెల 28 నుంచి ఈనెల 9వ తేదీ వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు గురువారం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీవో అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ బాలసుందరరావు మాట్లాడుతూ రోడ్డుపైకి ప్రతి ఒక్కరూ ధ్రువీకరణ పత్రాలతో రావాలని చెప్పారు. నంబర్ ప్లేట్ లేకపోయినా, ట్రిపుల్ రైడింగ్, మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు ట్రాఫిక్ ఎస్ఐలు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మిర్చి యార్డులో కూలీలు, కార్మికుల ఆందోళన

మచ్చు కాయల నిషేధంపై రగడ



ఆందోళనకారులతో మాట్లాడుతున్న నల్లపాడు పోలీసులు

కొరిటెపాడు(గుంటూరు): మిర్చి యార్డులో మచ్చు కాయల విషయంలో వివాదం చోటు చేసుకుంది. మచ్చు కాయల దోపిడీదారుల్ని సిబ్బంది అడ్డుకోవడంతో కూలీలు, కార్మికులు మిర్చి యార్డు పరిపాలన కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. మచ్చు కాయల నిషేధాన్ని ఎత్తివేయాలంటూ నినాదాలు చేపట్టారు. యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ వాహనాన్ని అడ్డుకుని చుట్టుముట్టి, కిందకు దిగకుండా అడ్డుకున్నారు. యార్డు సిబ్బంది నల్లపాడు పోలీసులకు సమాచారం అందజేశారు. వారు రంగప్రవేశం చేసి కూలీలు, కార్మికులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. యార్డు చైర్మన్ రాజనారాయణను కార్యాలయంలోకి పంపారు. దీంతో వివాదం సద్దుమణిగింది. మిర్చి యార్డు డైరెక్టర్లు ఎం.సతీష్ కుమార్, ఖాజామొహిద్దీన్, జి.ప్రభుదాసు, ఇంద్రారెడ్డి మాట్లాడుతూ చైర్మన్ రాజనారాయణపై దాడిని తీవ్రంగా ఖండించారు. రైతులకు మేలు జరగాలన్న ఉద్దేశంతో పాలకవర్గం మచ్చు కాయలు తీయడం నిషేధించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని, అలజడులు సృష్టించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్ యార్డు అయిన గుంటూరు మిర్చి యార్డుకు చెడ్డ పేరు తెస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు.

ఆర్థిక వ్యవస్థను చావు దెబ్బతీసిన పెద్ద నోట్ల రద్దు



సమావేశంలో మాట్లాడుతున్న విద్యావేత్త చంద్రయ్య

లక్ష్మీపురం: భారత ఆర్థిక వ్యవస్థను పెద్ద నోట్ల రద్దు చావు దెబ్బతీసిందని, సామాన్యుల బతుకులపై విపరీత ప్రభావాన్ని చూపిందని విద్యావేత్త, విశ్లేషకులు ఈ.చంద్రయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద నోట్ల రద్దు.. ఏడేళ్లు అనే అంశంపై నిర్వహించిన చర్చలో చంద్రయ్య మాట్లాడారు. సగటు మనిషి జేబులు ఖాళీ చేసి, అస్మదీయ బడా వ్యాపారులకు దోచి పెట్టే ఉద్దేశంతో కేంద్రం నోట్ల రద్దు ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ దుష్ఫలితాల నుంచి దేశం ఇంకా కొలుకోలేదని తెలిపారు. వేలాది చిన్న, మధ్య తరహా వ్యాపారాలు మూత పడటం, లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయారన్నారు. పొదుపు పూర్తిగా తుడిచి పెట్టుకుపోవడం వంటి పెద్ద నోట్ల రద్దు దుష్పరిణామాల్ని దేశ ప్రజలు మర్చి పోలేరని తెలిపారు. విశ్రాంత రాజనీతి శాస్త్రశాఖాధిపతి ఎస్.తిరుపతయ్య, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆర్థిక సర్జికల్ దాడిగా పెద్ద నోట్ల రద్దును పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ ప్రసంగించారు.

అంకుర పరిశ్రమల స్థాపనతోనే దేశ ఆర్థిక పురోగతి



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: అంకుర పరిశ్రమల స్థాపనల వృద్ధిపైనే దేశ ఆర్థిక పురోగతి ఆధారపడి ఉందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరంలోని కళాశాలలో నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డే వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి వినూత్న ఆలోచనలు కూడా పెట్టుబడిగా మార్చవచ్చని తెలిపారు. ప్రాఫిట్ షూ కంపెనీ వ్యవస్థాపకుడు బోడేపూడి శివకోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటుగా సొంతంగా నూతన పరిశ్రమల స్థాపన, భవిష్యత్‌లో వ్యాపార రంగంలో ఏర్పడే పోటీతత్వం, పరిశ్రమలు విజయాల దిశగా ముందుకు వెళ్లేందుకు అనుసరించాల్సిన పలు అంశాల్ని వివరించారు. వినూత్న ఆలోచనలతో, సామాన్యుల అవసరాలకు అనుగుణంగా నిత్యం నూతన వస్తువుల తయారీకీ ప్రాధాన్యతను ఇస్తూ, దానికి తగ్గట్టు మార్కెటింగ్ చేయాలని సూచించారు. ఉద్యోగాలు ఆశించే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరే విధంగా విద్యార్థుల ఆలోచనలు ఉండాలని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. అనంతరం అతిథుల్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాస్, ఈఎండీ సెల్ కో- ఆర్డినేటర్ ఎం.వి.పి. చంద్రశేఖర్, ఐఐపీ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నాగమల్లేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు శాఖ గ్రంథాలయంలో 14 నుంచి 20వ తేదీ వరకూ 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్ని నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ వి. పరమేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా బాలల దినోత్సవం, ప్రతి రోజు పుస్తక పఠనం, పుస్తకాల ప్రాముఖ్యత, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన, సెమినార్, విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు, దిశ చట్టంపై అవగాహన, చదువుపై చర్చలు తదితర కార్యక్రమాల్ని నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ వారోత్సవాలలోపు గ్రంథాలయం నుంచి పుస్తకాలు తీసుకుని తిరిగి ఇవ్వని వారి నుంచి అపరాధ రుసుం మినహాయించి తీసుకుంటామని ఆమె తెలియజేశారు.

మత్తుతో జీవితాలు చిత్తు

నగరంపాలెం: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెబ్ స్టేషన్ గుంటూరు-1 సీఐ ఎం. రమేష్ సూచించారు. సెబ్ జిల్లా ఏఎస్పీ డీఎస్.మహేష్ ఆదేశాల మేరకు గురువారం నాజ్ కూడలిలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలు జీవితాల్ని ఛిన్నాభిన్నం చేస్తాయని చెప్పారు. తద్వారా కుటుంబాలు ఆర్థిక పరిస్థితులు దారుణంగా మారతాయ తెలిపారు. డ్రగ్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ బానిసకావద్దని, తద్వారా తల్లిదండ్రులకు కడుపు కోత మిగల్చవద్దని సూచించారు. డ్రగ్స్ భూతాన్ని ప్రతి ఒక్కరూ తరిమికొట్టాలని, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను సాకారం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థుల సందేహాల్ని నివృత్తి చేశారు. సమావేశంలో ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు, స్టేషన్ సిబ్బంది, వసతి గృహం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు

ఈఈ సీహెచ్. రమేష్



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

ప్రత్తిపాడు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని గుంటూరు ఈఈ సీహెచ్. రమేష్ తెలిపారు. మండలంలో విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా సర్వీసుల్ని తనిఖీ చేశారు. అనంతరం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈఈ రమేష్ వివరాల్ని వెల్లడించారు. ఆపరేషన్ సిబ్బంది 30 బృందాలుగా, విజిలెన్స్ సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించాయని తెలిపారు. మండలంలోని పదహారు గ్రామ పంచాయతీల్లో మొత్తం 2750 సర్వీసుల్ని తనిఖీలు చేశారని చెప్పారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన నలుగురిపై కేసులు నమోదు చేసి రూ. 3 లక్షల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అదనపు లోడ్ కింద 56 సర్వీసులకు గాను రూ. 1,44,000 విధించామని రమేష్ వివరించారు. తనిఖీల్లో సీఆర్‌డీఏ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి. విజయ్ కుమార్, విజిలెన్స్ ఈఈ కె.వి.ఎల్. మూర్తి, డెప్యూటీ ఈఈలు ఏ. గురునాథరావు, అశోక్, పి.వి.ఆర్. మల్లికార్జునరావు, పదకొండు మంది ఏఈలు పాల్గొన్నారు.

16న తెనాలి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

తెనాలి రూరల్: పట్టణ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ఈ నెల 16న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడంతో తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మను ఎన్నికల అధికారిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారని మున్సిపల్ కమిషనర్ ఎం. జస్వంతరావు తెలిపారు. 16వ తేదీన చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని చెప్పారు. ప్రస్తుతం 7వ వార్డు కౌన్సిలర్ మాలేపాటి హరిప్రసాద్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక



వై.నాగమణి



గేరా ఏసేబు

కాకుమాను: యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఎంపికను గురువారం మండల కేంద్రం కాకుమానులో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ అధ్యక్షతన నిర్వహించారు. కాకుమాను మండల శాఖ అధ్యక్షురాలిగా వై.నాగమణి, ప్రధాన కార్యదర్శిగా గేరా ఏసేబులు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు కళాధర్ తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఏసేబు మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడతానని తెలిపారు. అనంతరం నూతనంగా నియమితులైన యూటీఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు ఈవూరి శ్రీనివాసరావు, వాసు, అనిత, గౌస్‌లను నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, డి.శాయికృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఖైదీ మృతి

గుంటూరు ఈస్ట్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ మృతిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. చిలకలూరిపేటకు చెందిన పి.ప్రభాకరరావు (52)పై నరసరావుపేట-2టౌన్ పోలీసులు గంజాయి విక్రయిస్తున్న ఘటనపై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరిచి రిమాండ్ నిమిత్తం గుంటూరులోని జిల్లా జైలుకు పంపారు. అక్కడ ప్రభాకరరావు ఈనెల 7న అస్వస్థతకు గురయ్యాడు. జైలు అధికారులు అతడ్ని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



బీకేపాలెం (కాకుమాను): గ్రామాల్లో రైతుల భూ సమస్య పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ట్రైనీ డెప్యూటీ కలెక్టర్ స్వాతి తెలిపారు. మండలంలోని బీకేపాలెం గ్రామ సచివాలయం వద్ద గురువారం భూ రీసర్వేపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందల సంవత్సరాల నుంచి భూ సమస్యలపై ఇబ్బందులు పడుతున్న రైతుల కష్టాల్ని తొలగించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో సమగ్ర భూ రీసర్వే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.దీనిద్వారా రైతులందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. రీ సర్వేకి గ్రామాల్లోని రైతులంతా సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారులు శ్రీనివాసరావు, కోటిరెడ్డి, తహసీల్దార్ జె.ప్రసాదరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నడింపాలెంలో మూడు బోర్లు ఏర్పాటు



నడింపాలెం (ప్రత్తిపాడు): మండలంలోని నడింపాలెం గ్రామ పంచాయతీలో గురువారం మంచినీటి బోర్లు తీయించారు. జలజీవన్ మిషన్ కింద ఒకటి, మండల పరిషత్ నిధుల నుండి మరో బోరును తీయించారు. గ్రామానికి చెందిన పి. లింగయ్య జ్ఞాపకార్థం ఆమె కుమార్తె జి. పద్మారాణి స్వచ్ఛందంగా మరొక బోరును వేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బోర్లు తీయించేందుకు దాతలు ముందుకు రావడం స్వాగతించదగిన విషయమన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్ మాట్లాడుతూ గ్రామాల్లో బోర్లను తీసుకోవడం ద్వారా మంచినీటి ఎద్దడిని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వాసిమళ్ల మాణిక్యరావు, సొసైటీ అధ్యక్షుడు ఆళ్ల వీరాస్వామి, సోషల్ మీడియా మండల కన్వీనర్ వాసిమళ్ల అమృతయ్య, పంచాయతీ కార్యదర్శి ఖాజా పాల్గొన్నారు.

రూరల్ మండలం ఇన్‌చార్జ్ ఎంపీపీగా పద్మావతి



గుంటూరు రూరల్: రూరల్ మండలం ఇన్‌చార్జ్ ఎంపీపీగా ఇంటూరి పద్మావతి గురువారం నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎంపీపీగా ఉన్న పులగం దివ్య పదవికి రాజీనామా చేయడంతో వైఎస్ ఎంపీపీగా ఉన్న ఇంటూరి పద్మావతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.తనకు బాధ్యతలు అప్పగించినందుకు గానూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకతోటి సుచరితలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమెకు ఎంపీడీవో ఆదినారాయణ, ఈవో పీఆర్డీ శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచులు, సెక్రటరీలు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంటూరి అంజిరెడ్డి, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు చేబ్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చేబ్రోలు: స్థానిక మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి. బాబూరావు గురువారం తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలగడ్డ సాహితి అధ్యక్షతన సమావేశంలో వివిధ అంశాలపై సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఓటర్ల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు

కమిషనర్ కీర్తి చేకూరి



హెల్ప్ డెస్క్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఓటర్లు తమ ఓటుపై సందేహాల్ని ఫోన్ కాల్ ద్వారా తెలుసుకోవచ్చని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం ఓటర్ హెల్ప్ డెస్క్‌ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఓటర్లకు తమ ఓటుకు సంబంధించిన ఏ సందేహం ఉన్నా తీర్చడానికి వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ని ఏర్పాటు చేశామని తెలిపారు. తూర్పు నియోజకవర్గానికి 0863-2345104, పశ్చిమ నియోజకవర్గానికి 2345105 నంబర్లను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా ఆపరేటర్లను నియమించామని చెప్పారు. ఓటర్లు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:30 గంటల్లోపు ఫోన్ చేసి తమ ఓటుకి సంబంధించి సందేహాల్ని తెలుసుకోవచ్చని ఆమె సూచించారు. హెల్ప్ డెస్క్‌లో నిర్దేశిత సమయంలో సిబ్బంది ఉండాలని, ఓటర్ల నుంచి అందే ఫోన్ కాల్స్‌ని పోలింగ్ బూత్‌ల వారీగా సమగ్ర వివరాలతో రిజిస్టర్‌లో నమోదు చేయించాలని మేనేజర్‌ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ భానుప్రకాష్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ఆస్ట్రేలియన్ స్టడీస్ - ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో 'మార్జినాలిటీ, మల్టీకల్చరల్ లిటరరీ లాండ్ స్కేప్ నేటివ్స్ ఫ్రం ఆస్ట్రేలియా, ఇండియా' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను గురువారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఫిబ్రవరి 26 నుంచి 28 తేదీ వరకు యూజీసీ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని, తాను డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నానని తెలిపారు. ఆస్ట్రేలియా - ఇండియాల సాహిత్యం, సంస్కృతిని తెలియజే పరిశోధన పత్రాలు ఈ ఏడాది డిసెంబర్ 30వ తేదీలోపు nu_vc@yahoo.co,in , derrida@fmai .com వెబ్ సైట్లకు పంపాలని సూచించారు. పరిశోధన పత్రాలు సమర్పించేవారు భారత్ - ఆస్ట్రేలియా సారూప్య సాహిత్యానికి సంబంధించిన వారై ఉండాలని తెలిపారు. సదస్సులో ఆస్ట్రేలియాకు చెందిన ఏడు యూనివర్సిటీలు, ఇండియా నుంచి తొమ్మిది యూనివర్సిటీల నుంచి రిసోర్స్ పర్సన్స్ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఆస్ట్రేలియా, ఇండియా దేశాల్లోని అణగారిన వర్గాల సాహిత్యానికి, భాషలకు సదస్సులో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. రెండు దేశాలలో విభిన్న భాషలు, సంస్కృతి, సాహిత్యాన్ని సదస్సులో చర్చించనున్నారని వీసీ తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణలో రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఆంగ్ల భాషా విభాగాధిపతి ఆచార్య జి. చెన్నారెడ్డి, పీజీ పరీక్షల కో-ఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయకుమార్, అధ్యాపకులు భవాని, మంజూష, నరసింహారావు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబ సభ్యులకు చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: మృతి చెందిన పోలీసుల కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె. సుప్రజ తెలిపారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కె.మధుసూదన్ (1988 బ్యాచ్) జూలై 6న మంగళగిరిలో మరణించారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మున్నంగి కిశోర్ (2009 బ్యాచ్) గతనెల 10న ఇంటి వద్ద మరణించారు. ఇద్దరి కుటుంబ సభ్యులకు ఫ్లాగ్/ విడో ఫండ్ కింద ఒక్కొక్కరికీ రూ.75 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు హెచ్‌సీ మధుసూదన్ కుమారుడు సదానందం, పీసీ కిశోర్ భార్య సుధారాణికి చెక్కుల్ని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీవో) ఆవరణలో ఏఎస్పీ కె.సుప్రజ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలు ఉన్నట్లయితే నేరుగా సంప్రదించవచ్చునని వారికి సూచించారు. కార్యక్రమంలో డీపీవో సెక్షన్ సూపరింటెండెంట్ రమాదేవి పాల్గొన్నారు.

క్రమశిక్షణ, నైతికతతోనే అవినీతి అంతం



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజిలెన్స్ ఆఫీసర్ బాల్ ముకుంద్‌శర్మ

పెదకాకాని: అవినీతి నిర్మూలనలో యువత పాత్ర కీలకమని.. నైతికత, వ్యక్తిగత క్రమశిక్షణ అవినీతిని అంతం చేయగలవని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అడిషనల్ చీఫ్ సెంట్రల్ విజిలెన్స్ ఆఫీసర్ బాల్ ముకుంద్‌శర్మ తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం 'అవినీతికి నో చెప్పండి.. దేశానికి కట్టుబడి ఉండండి' అనే నినాదంతో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం అవినీతి, దుష్ప్రభావాల పాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వ్యాసరచన, క్విజ్ డిబేట్‌లను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాల్‌ముకుంద్‌శర్మ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని తెలిపారు. విద్యావంతులే సమాజాన్ని పారదర్శకంగా, జవాబుదారీతనంగా తీర్చిదిద్దగలరని పేర్కొన్నారు. దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని, 2030 నాటికి మూడవ అతి పెద్ద ఆర్థిక దేశంగా ఎదగడానికి అవినీతి నిర్మూలనే మార్గమని తెలిపారు. కార్యక్రమంలో సీజీబీజీ చైర్మన్ టి. కామేశ్వరరావు, సీజీబీజీ జనరల్ మేనేజర్ పి. మారుతీరామ్, రీజనల్ మేనేజర్ పి. వీరారెడ్డి, విజిలెన్స్ అధికారులు రాంబాబు, విజయ్‌కుమార్, నంబూరు బ్యాంక్ మేనేజర్ కోటిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధుల అసహనం



సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి

పెదనందిపాడు: అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధుల అసహనం వ్యక్తం చేశారు. తమ గ్రామాల్లో సమస్యలు ఎందుకు తీర్చరంటూ ధ్వజమెత్తారు. గ్రామాలకు ఎంత నిధులు వచ్చాయి.. జరిగిన పనుల గురించి ప్రశ్నించారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ హెప్సిబా అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పుసులూరు ఎంపీటీసీ సభ్యురాలు చెల్లి లక్ష్మి మాట్లాడుతూ తమ గ్రామం పరిధిలో కత్రపాడు, పమిడివారి పాలెం గ్రామాలు కూడా ఉన్నాయని, వాటికి ఎన్ని నిధులు మంజూరు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిధులు మంజూరు చేసిన మాట వాస్తవమేనని, వాటిని త్వరలోనే తెలియజేస్తామని అధికారులు ఆమెకు తెలిపారు. ఏబీపాలెం ఎంపీటీసీ సభ్యుడు సయింపు శ్రీనివాసరావు మాట్లాడుతూ వరగాని శివారున ఉన్న కొల్లా వారి చెరువు నుంచి కాంట్రాక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల గ్రామాలకు తాగునీరు సక్రమంగా అందడం లేదని సభ దృష్టికి తెచ్చారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారుల్ని కోరారు. అన్నవరంలో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఎంపీటీసీ సభ్యులు జంగా సుందర్ ఆ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండల ప్రత్యేక అధికారి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసింది గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసమేనని, ప్రజా ప్రతినిధులు చెప్పిన సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని ఆమె తెలియజేశారు. సమావేశంలో ఎంపీడీవో రాజగోపాల్, వైస్ ఎంపీపీలు షేక్ ఖాశింబీ, కమ్మ సాంబశివరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

